
ఆంధ్రజ్యోతి



రేషన్‌షాపుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

చేగుంట, మే 16 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలంలోని వడియారం, చేగుంట గ్రామాల్లోని రేషన్‌షాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో వెయిటింగ్ మిషన్, స్టాక్ రికార్డులను పరిశీలించారు. రేషన్‌షాపుల్లో ఎక్కడైనా సన్నబియ్యం దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

ఎన్యూమరేటర్లకు డబ్బులు ఇవ్వరా?



- ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పలుశాఖల్లో అధికారుల నిలదీత
- మరోసారి విధులు నిర్వహించాలంటే ఎలా అని ప్రశ్న

8



7

242 రకాల మామిడి పండ్ల ప్రదర్శన

హైబ్రిడ్ మోడల్ రోడ్లకు సర్వే



- 'హామ్' పథకం ద్వారా గజ్వేల్ నియోజకవర్గంలో మూడు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదన
- తూప్రాన్ నుంచి మల్కాపూర్ వరకు, సొసైటీ నుంచి ఇస్లాంపూర్ వరకు
- అల్లాపూర్ చౌరస్తా నుంచి వెంకటాయపల్లి వరకు

7

సాయంత్రం బడులు

వచ్చేస్తున్నాయ్

- సామాజిక చైతన్య కేంద్రాల పేరిట వయోజన విద్య
- జూన్ 1 నుంచి ప్రారంభం
- ఈ నెల 24 వరకు నిరక్షరాస్యుల గుర్తింపు

మెదక్ అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత కోసం సర్కార్ మళ్లీ సాయంత్రం బడులను ప్రారంభించాలని నిర్ణయించింది. సామాజిక చైతన్య కేంద్రాల పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. గతంలో వయోజన విద్యా కేంద్రాల ద్వారా సాయంత్రం బడులు నిర్వహించారు. గ్రామంలో 19 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యులకు ఈ కేంద్రాల్లో ప్రత్యేక వలంటీర్లు విద్యా బోధన చేసేవారు. ఇరవయ్యేళ్ల క్రితం ఈ కేంద్రాలు రద్దయ్యాయి. తాజాగా అక్షరాస్యత పెంచడం కోసం సామాజిక చైతన్య కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. ఇందుకోసం ఈ నెల 24 వరకు మండలస్థాయిలో చదువురాని వయోజనులను గుర్తించి, వారి పేర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తారు. ఆయా గ్రామాల్లో ఎంతమంది నిరక్షరాస్యులున్నారో లెక్కతీసి సామాజిక చైతన్య కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. ఈ కార్యక్రమానికి మండలస్థాయిలో ఎంఈవో కన్వీనర్‌గా, ఐకేపీ ఏపీవో కో-కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గ్రామస్థాయిలో ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, వీపీపీఎస్ చైర్మన్ కో-కన్వీనర్‌గా, మహిళా సంఘం సభ్యురాలు, విశ్రాంత ఉపాధ్యాయుడు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సభ్యులుగా వ్యవహరిస్తారు. జిల్లాలో సామాజిక చైతన్య కేంద్రాలను జూన్ 1 నుంచి ప్రారంభించనున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

ఈసారైనా

సజావుగా సాగేనా!

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి ముమ్మర కసరత్తు

- నెలాఖరులోపు పూర్తిచేయాలని లక్ష్యం
- తొలుత సింగిల్ పోస్టుల నియామకం
- చకచకా సాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- త్వరలో ప్రొవిజనల్ జాబితా, ఇంటర్వ్యూలు
- అనంతరం మిగిలిన పోస్టులపై దృష్టి



సంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో 117 పోస్టుల భర్తీకి గత నెల 29న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 3 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా 3,110 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు 1,355 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నది. అయితే గతేడాది 97 పోస్టుల భర్తీకి ఆ శాఖ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఒకటి, రెండు కేటగిరీలు తప్ప మిగిలనవి భర్తీ చేయలేదు. ఏడాది సాగదీసినా నియామకాలు పూర్తిచేయకపోవడంతో వైద్యశాఖ తీవ్ర విమర్శల పాలైంది.

తొలుత ఆ పోస్టుల భర్తీ

నియామకాల్లో భాగంగా తొలుత సింగిల్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఇందులో పీడియాట్రిక్ డాక్టర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, టీబీహెచ్‌వీ, ఫిజిషియన్ డాక్టర్, డీఈఐసీ మేనేజర్, డెంటల్ టెక్నిషియన్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్(ఫిమేల్), బయోకెమిస్ట్, డీఈవో(డేటా ఎంట్రీ ఆపరేటర్), ఆప్తాల్మిక్ అసిస్టెంట్, సీటీ రేడియోగ్రాఫర్ పోస్టులు ఒక్కోటి చొప్పునే భర్తీకి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ముందుగా ఆయా పోస్టులకు వచ్చిన దరఖాస్తుల స్క్రూటినీ కొనసాగుతున్నది. త్వరలో ఆయా పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ జాబితాను ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరించి ఫైనల్ మెరిట్ జాబితా ప్రదర్శించి, ఇంటర్వ్యూలు నిర్వహించి భర్తీ చేయనున్నారు. ఆ తరువాత ఎక్కువ దరఖాస్తులు వచ్చిన మిగతా పోస్టులను ఈ నెలాఖరు లోపు భర్తీ చేయాలనే యోచనలో ఉన్నట్లు వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.

కలెక్టర్ ఫోకస్

డీఎంహెచ్‌వో పరిధిలో ప్రస్తుతం జరగనున్న నియామకాల విషయంలో కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. గతేడాది నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వివిధ కారణాలతో వైద్యాధికారులు భర్తీ చేపట్టకుండా ఏడాదిగా పక్కనపెట్టారు. ఈక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఉన్నతాధికారులపై పలు ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. ఈసారి మళ్లీ ఆ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ రిక్రూట్‌మెంట్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు తెలిసింది. ఎటువంటి పైరవీలకు తావులేకుండా ఎలాగైనా నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలనే ఆలోచనలో కలెక్టర్ ఉన్నట్లు సమాచారం. రిక్రూట్‌మెంట్‌లో ఎవరూ తలదూర్చవద్దని సీరియస్‌గా సూచించినట్లు తెలిసింది.

డీఎస్సీలో మార్పులు!

జిల్లా వైద్యఆరోగ్యశాఖ పరిధిలో జరిగే నియామకాలన్నీ డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ఆమోదంతోనే జరుగుతాయి. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, ఓ ప్రోగ్రాం ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. గతంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌తో పాటు డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రోగ్రాం ఆఫీసర్ సభ్యులుగా ఉండేవారు. తదనంతరం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కమిటీ నుంచి తొలగించారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ఆస్పత్రి.. జీజీహెచ్‌గా మారినా మెడికల్ సూపరింటెండెంట్‌కు మాత్రం డీఎస్సీలో స్థానం కల్పించలేదు. కీలకమైన పోస్టుల నియామకం చేపేట్టే కమిటీలో జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో పాటు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌ను కూడా సభ్యులుగా చేర్చాలని నిపుణులు, సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు.



సంగారెడ్డి టీ-హబ్‌లో

నిలిచిన టెస్టులు

- రసాయనాలు లేక పది రోజులుగా రక్త పరీక్షలు చేయని సిబ్బంది
- జిల్లావ్యాప్తంగా గ్రామీణ రోగులకు ఇబ్బందులు

సంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ (టీ-హబ్) సెంటర్‌లో పలు రకాల టెస్టులు నిలిచాయి. రోగ నిర్ధారణకు ఉపయోగించే రసాయనాలు అయిపోవడంతో పరీక్షలు నిర్వహించడం లేదు. పది రోజులుగా ఈ పరిస్థితి ఉండడంతో టీ-హబ్‌లో నిర్వహించే సీఆర్‌పీ, ఆర్‌ఎఫ్‌టీ, ఆర్‌ఏ, హెచ్‌బీఏ-1సీ, విటమిన్ డీ-3తో పాటు ఎల్‌ఎఫ్‌టీ తదితర పరీక్షలకు బ్రేక్ పడింది. వైద్య చికిత్సలో వ్యాధి నిర్ధారణ పరీక్షలదే కీలకం. వీటి ఖర్చు కూడా ఎక్కువే. పేద మధ్య తరగతి వర్గాల రోగులకు ఆ భారం తగ్గించేందుకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గత సర్కారు తెలంగాణ డయాగ్నోస్టిక్(టీ-హబ్) కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే కీలకమైన పరీక్షలు నిలిచిపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, పలు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా ప్రైవేటును ఆశ్రయించి డబ్బులు పెట్టి పరీక్షలు చేసుకోవాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, సంబంధిత వైద్య అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా టీ-హబ్‌లో తరుచూ వైద్య పరికరాల బ్రేక్ డౌన్‌తో పాటు రసాయనాల కొరత ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మైదాన భూములు మాయం..

మిగిలింది గుట్టలే!

..వాటినీ వదలని భూబకాసురులు

- సుల్తాన్‌పూర్‌లో రియల్ మాఫియా పాగా
- భూముల రక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



అమీన్‌పూర్‌లో గుట్టలను చదునుచేసి కబ్జా చేస్తున్న భూమి (ఫైల్)

అమీన్‌పూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టా భూముల పక్కన ఉన్న ప్రభుత్వ భూములను, నోటరీ రిజిస్ట్రేషన్‌లతో అసైన్డ్, సర్కారు భూములను 'రియల్' గద్దలు స్వాహా చేయడంతో మైదాన ప్రాంత భూములన్నీ కరిగిపోయాయి. సర్వే నంబర్‌లు 992, 993, 994, 996తో పాటు ఇతర సర్వే నంబర్లలో గుట్టలు, రాళ్లు ఉన్న భూములే మిగిలాయి. వీటిని భూబకాసురులు వదలడం లేదు. ఇన్నాళ్లు అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని బీరంగూడ గుట్ట చుట్టూరా, పాత గ్రామపంచాయతీ అయిన కిష్టారెడ్డిపేట ప్రాంతాన్ని చెరబట్టి తమ కబ్జా దాహం తీర్చుకున్న రియల్ మాఫియా తాజాగా ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉన్న సుల్తాన్‌పూర్‌లోని భూములపై కన్నేశారు.

దశాబ్దాలుగా ప్రజాప్రతినిధుల అండతో, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సర్వే నంబర్ 993లోని దాదాపు 450 ఎకరాల్లో 350 ఎకరాల మైదాన ప్రాంత భూములను హాంఫట్ చేసేశారు. సదురు కబ్జా భూముల్లో ప్రస్తుతం కాలనీలు వెలిసి, గృహాల నిర్మించుకుని నివాసాలను ఏర్పరుచుకోవడంతో నగరాన్ని తలపిస్తుండడం గమనార్హం. విలువైన భూములు పోగా మిగిలిన వంద ఎకరాల భూమి గుట్టలు, రాళ్లతో విస్తరించి ఉన్నది. దీనిని రియల్ గద్దలు వదలడం లేదు. గతంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం ఉన్న బీరంగూడ గుట్టను ఆనుకుని ఓ లేఅవుట్ యజమాన్యం కబ్జాకు పాల్పడగా అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక నాయకత్వం అడ్డుకున్నది. నెల రోజుల క్రితం కబ్జా స్థలంలో నిర్మాణలను చేపడుతుండగా అఖిలపక్షం పరిశీలించి, ఆలయ గుట్టను సంరక్షించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతీసారీ ఎక్కడ ఓ చోట మిగిలిన గుట్ట ప్రాంతంలోనూ కబ్జాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

చదును చేయడానికే రూ.కోట్ల ఖర్చు

ఇటీవల ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ, నవోదయ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట ఉన్నతాధికారులు స్థలాన్ని పరిశీలించారు. విద్యాసంస్థలకు భూమి కావాలంటే పెద్ద గుట్టను చూపించడంతో ఉన్నతాధికారుల కంగుతిన్నారు. మైదాన భూమి కబ్జాలకు గురికావడంతో ప్రస్తుతం అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఒకవేళ స్థలాన్ని కేటాయిస్తే చదును చేసేందుకే కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. గతంలో మినీస్టేడియానికి ఐదెకరాలను కేటాయిస్తే రెండు కోట్లు ఖర్చుపెట్టినా కొండ తరగడం లేదు. పక్కనే రాక్ గార్డెన్, పోలీసుస్టేషన్, రెవెన్యూ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మున్సిపల్ కార్యాలయాలకు స్థలాలను కేటాయించినా రాళ్లు ఉండటంతో చదును చేసేందుకు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి రావడంతో తడిసిమోపెడవుతున్నది. దీంతో అధికారులు పునరాలోచనలో పడ్డట్లు తెలిసింది.

సుల్తాన్‌పూర్‌పై కన్ను

సుల్తాన్‌పూర్‌లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఇక్కడ మెడికల్ డివైజ్ పార్కు రావడం, దగ్గరలోనే మియాపూర్ ఉండటంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అంతేకాకుండా ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ ఉండటంతో ల్యాండ్ మాఫియా కొంత కాలంగా ఇక్కడ పాగా వేశారు. వివాదాస్పద సర్వే నంబర్ 30లో పెద్ద ఎత్తున ఆక్రమణలకు భారీ స్కెచ్ వేశారు. సర్వే నంబర్ 381లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు స్థానిక చోటామోటా నాయకుల సహాయంతో రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమై కూల్చివేసింది.

కలెక్టర్ సీరియస్

సర్వే నంబర్ 993లో కబ్జాలను కలెక్టర్ వల్లూరి క్రాంతి సీరియస్‌గా తీసుకున్నారు. సంరక్షణకు ఆదేశాలు జారీ చేశారు. కబ్జాలను నియత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి సూచించారు. స్థలాల చుట్టూ ఫెన్సింగ్ వేయాలని ఆదేశాలు జారీ చేశారు. కబ్జాలను అరికట్టేందుకు ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. కబ్జాలకు పాల్పడే వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తహసీల్దార్‌ను సైతం ఆదేశించారు. గతంలోనూ ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన శరత్ పలు చోట్ల ప్రహరీలను నిర్మించడంతో కబ్జాలు తగ్గుముఖం పట్టాయి. ఇదే పద్ధతిలో ప్రహరీతో పాటు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమిస్తే అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా రక్షించే అవకాశాలున్నాయని స్థానికులు భావిస్తున్నారు. విలువైన భూముల సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

> **కఠిన చర్యలు తీసుకుంటాం**
>
> అమీన్‌పూర్ మండలంలో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎవరినీ ఉపేక్షించే పరిస్థితిలేదు. ఆక్రమణలు కూల్చిన తరువాత అక్కడే మళ్లీ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. పదే పదే కబ్జాలకు పాల్పడేవారిని గుర్తించి ల్యాండ్ గ్రాబింగ్, కుదిరితే కలెక్టర్ అనుమతితో పీడీ కేసులను పెట్టేందుకు సైతం వెనకాడబోం. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 993, 630, 343 తదితర సర్వే నంబర్లలో కబ్జాలను నియంత్రిస్తున్నాం. కబ్జాభూములు, సీలింగ్, అసైన్డ్‌భూములను నోటరీలపై కొనుగోలు చేసి మోసపోకూడదని ప్రజలకు చెబుతున్నాం. ఎక్కడ స్థలం కొనాలన్నా ముందుగా రెవెన్యూ కార్యాలయంలో తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలి.
>
> - వెంకటస్వామి, అమీన్‌పూర్ తహసీల్దార్



కొత్త బార్లకు

దరఖాస్తులు

సంగారెడ్డి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని రామచంద్రాపురం, పటాన్‌చెరు పరిధిలో 24 బార్లను ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హరికృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 6 లోగా డిప్యూటీ కమిషనర్ కార్యాలయం సంగారెడ్డి, రంగారెడ్డి లేదా కమిషనర్ కార్యాలయం హైదరాబాద్‌లో పనివేళల్లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఆసక్తి గలవారు సింపుల్ అప్లికేషన్ ఫారమ్, మూడు ఫొటోలు, రూ. లక్ష చలానా డీడీ (నాన్‌రిఫండబుల్), ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్ ప్రతులు జతపర్చాలని వెల్లడించారు. జూన్ 13న ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ సమక్షంలో డ్రా తీస్తామన్నారు. డ్రా ఎక్కడ నిర్వహించేది తరువాత వెల్లడిస్తామని తెలియజేడం జరుగుతుందన్నారు. పూర్తి సమాచారం కోసం 8712658904, 8712658913 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌కోలో అవినీతిపై

విజిలెన్స్ విచారణ

విక్రయించిన కండక్టర్ వైరును తెప్పించేందుకు అధికారుల తంటాలు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా టాన్స్‌కోలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. 'ట్రాన్స్‌కోలో అవినీతి భాగోతం' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు, విజిలెన్స్ స్పందించారు. ఓ మంత్రి బంధువుకు సంబంధించిన వెంచర్‌లో ఏర్పాటు చేయాల్సిన రూ.20 లక్షల విలువైన 17 కిలోమీటర్లమేర కండక్టర్ వైరును బ్లాక్ మార్కెట్‌కు తరలించి విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం వెలుగు చూడటంతో విద్యుత్‌శాఖలో కలకలం చెలరేగింది. ఈమేరకు పటాన్‌చెరులోని కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. రెండేళ్ల క్రితం వెంచర్‌కు మంజూరైన కండక్టర్ వైరును అధికారులు ఈ నెల 14న ప్రైవేట్ వాహనంలో గుట్టుచప్పుడు కాకుండా తరలించి అమ్మేసినట్లు తెలిసింది. విచారణ చేపట్టిన అధికారులు కండక్టర్ వైరును తరలించిన వాహనం వివరాలు, సంగారెడ్డిలోని స్టోర్ గోదాం నుంచి బయటకు ఎలా వెళ్లిందనే వివరాలతో పాటు, సంబంధిత ఫైల్ వర్క్ ఆర్డర్, మంజూరు పత్రాలు పరిశీలించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో బాధ్యులైన వారి వివరాలను కూడా సేకరించినట్లు తెలిసింది. విద్యుత్ సామాగ్రి మంజూరైన వెంచర్‌ను కూడా అధికారులు సందర్శించినట్లు తెలిసింది. దీంతో, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న కొంతమంది అధికారులు తప్పును కప్పిపుచ్చేందుకు తంటాలు పడుతున్నారని తెలుస్తున్నది. విక్రయించిన కండక్టర్ వైరును తిరిగి తెప్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు.

మంచం పట్టిన రూప్లాతండా

- చికున్‌గున్యా లక్షణాలతో బాధపడుతున్న గిరిజనులు
- కంగ్టి పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు



రూప్లాతండాలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

కల్హేర్, మే 16 (ఆంధ్రజ్యోతి): రూప్లా తండా మంచంపట్టింది. పదిహేను రోజులుగా కీళ్లనొప్పులు, జ్వరంతో గిరిజనులు అల్లాడుతున్నారు. ఈ విషయం బయటకు తెలియడంతో కంగ్టి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సిర్గాపూర్ మండల పరిధిలోని రూప్లా తండాలో రెండు వారాలుగా ప్రతి కుటుంబంలో ఎవరో ఒకరు కీళ్లనొప్పులు, జ్వరం బారిన పడుతున్నారు. నారాయణఖేడ్‌లోని ఆసుపత్రులకు, పొరుగు ఉన్న బీదర్ పట్టణానికి వైద్యం కోసం వెళ్తున్నారు. పరిస్థితి ఆలస్యంగా తెలియడంతో శుక్రవారం సిర్గాపూర్ ఎంపీఈవో బ్రహ్మం, పంచాయితీ క్యాదర్శి గౌతమ్, కంగ్టి పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రస్తుతం నలుగురికి కాళ్ల నొప్పులు, మరో ముగ్గురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. చాలా మంది ఇప్పటికే బయట చికిత్సలు చేయించుకోవడంతో తీవ్రత తగ్గిందని తెలిపారు. తండాలో పరిస్థితి ఇలా ఉన్నా అధికారులెవరూ సకాలంలో స్పందించలేదని గిరిజనలు ఆరోపించారు. తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఆందోళన చెందాల్సి అవసరం లేదని కంగ్టి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగమణి తెలిపారు. పలువురు అనుమానితుల రక్త నమూనాలను పరీక్షల కోసం పంపామని, చికున్‌గున్యా ఇంకా నిర్ధారణ కాలేదని ఆమె పేర్కొన్నారు.

బాల్య వివాహం నిలిపివేత

నర్సాపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి గొల్లపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. సీడీపీవో హేమభార్గవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలికకు గుమ్మడిదల మండలానికి చెందిన వ్యక్తితో శుక్రవారం వివాహం జరిపిస్తున్నారు. సమాచారం అందుకున్న సీడీపీవో పోలీసులతో కలిసి అక్కడికి వెళ్లి ఇరు కుటుంబాలకు నచ్చజెప్పి వివాహాన్ని నిలిపివేయించారు. అనంతరం బాలికను మెదక్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కేంద్రానికి తరలించారు.









రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్‌ను కమ్ముకున్న చిమ్మ చీకటి

ప్రమాదాలు జరుగుతున్నాయి..



రేడియల్ రోడ్డు 30 ఎక్సెటెన్షన్ విద్యుత్ దీపాలు లేక పోవడంతో రాత్రిళ్లు ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు మృత్యువాత పడ్డారు.

-ఈశ్వరీగారి రమణ

బైక్‌పై రావాలంటే భయమే..



విద్యుద్దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఈ దారిగుండా బైక్‌పై ప్రయాణించాలంటే జనం భయపడుతున్నారు. దశాబ్దాల క్రితం రాత్రి సమయాల్లో ఎలా ప్రయాణాలు సాగించామో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొన్నది.

-విష్ణు ముదిరాజ్

ఈ దారి.. చీకటి దారి

- అంధకారంలో రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్
- విద్యుద్దీపాల ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం

రామచంద్రాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ నేటికి పూర్తి కాలేదు. మండలంలోని గోపన్‌పల్లితండా నుంచి కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) వరకు 7 కిలోమీటర్ల మేర చేపడుతున్న ఈ రోడ్డును బీటీతోనే సరిపెట్టారు. అదీకూడా గుంతలుగా ఉన్నది. ఈ దారిలో విద్యుద్దీపాలను ఏర్పాటులో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రాత్రి సమయంలో ఈ దారిగుండా ప్రయాణించాలంటే ప్రజలు హడలెత్తి పోతున్నారు. తెల్లాపూర్ నుంచి కొల్లూరు వరకు చీకట్లలోనే ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నది. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. యువతులపై అత్యాచారం జరిగినా గుర్తించలేని పరిస్థితి నెలకొన్నది. అంతేకాకుండా ఈ రోడ్డును ఓ ప్రణాళికాబద్ధంగా నిర్మించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ విద్యుత్ ఏఈ మోనికను వివరణ కోరగా ఆ పనులు ఆర్అండ్‌బీ చేపడుతుందని చెప్పారు. ఆర్అండ్‌బీ అధికారిని వివరణ కోరే ప్రయత్నం చేయగా జవాబును దాటవేశారు.

మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం కక్ష

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

అక్కన్నపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించినా మావోయిస్టులతో చర్చలు జరపకుండా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కాగార్ పేరుతో మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీరు సత్యనారాయణ, కోయ్యడ కొమురయ్య, ఎడల వనేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేట మండలం గోవర్దనగిరిలో ర్యాలీలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

రైతులకు సాగునీరు అందివ్వని కాళేశ్వరం ప్రాజెక్టు

హుస్నాబాద్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు సాగు నీరు అందివ్వడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభించి 17 ఏళ్ల గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాలేదన్నారు. ఈ నెల 29న గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో గతంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని కూల్చివేయకుండా ప్రత్యామ్నాయ నిర్మాణాలు చేపట్టాలన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరి, అధికారులు

నేడు కొండాపూర్‌కు ముగ్గురు మంత్రులు

- భూ భారతి రెవెన్యూ సదస్సుకు హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, అధికారులు

కొండాపూర్,మే16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా కొండాపూర్ మండలాన్ని ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం మండలకేంద్రమైన కొండాపూర్‌లో భ భారతికి సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ, మంత్రి దమోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఇందులో భాగంగా మంత్రులు, జిల్లా స్థాయి అధికారులు భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరించనున్నారు. అయితే 40 నుంచి 50 ఏళ్ల ప్రభుత్వ భూములను సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్న చాలామంది రైతులకు ధరణి పోర్టల్ వచ్చాక కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రులు రెవెన్యూ సదస్సుకు హాజరవుతున్న వేళ సదరు సమస్యకు పరిష్కారం లభించనుందని పలువురు రైతులు చర్చించుకుంటున్నారు. మంత్రుల రాకను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి సభా స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని, కొండాపూర్ పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల ప్రక్రియ త్వరగా పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, డీఏవో శివప్రసాద్, ఏడీఏ వెంకటలక్ష్మి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, డీటీలు మల్లేశం, ప్రదీప్, ఆర్ఐలు రాజు, రాంచందర్, పీఏసీఎస్ చైర్మన్ మానిక్‌రెడ్డి, ఏవో గణేష్, ఏఈవోలు రవి, ప్రేమ్‌రాజ్ రెవెన్యూ, అగ్రికల్చర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళిఘణపూర్, మే 16;(ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని డైట్ కళాశాలలో ఉపాధ్యయుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా బోధన ఉండాలన్నారు. సాంఘికశాస్త్రం, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులవారీగా రిసోర్స్ పర్సన్ ద్వారా ఉపాధ్యాయులకు మూడు విడతల్లో గుణాత్మక శిక్షణ ఉంటుందన్నారు. తరువాత తెలుగు, హిందీ, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి శిక్షణ అందిస్తామన్నారు. బోధన సామర్థ్యాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడిన భర్తపై కేసు

తూప్రాన్, మే 16(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై భార్యపై వేధింపులకు పాల్పడుతున్నాడో భర్త. దీంతో ఆమె భరించలేక పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఈ సంఘటన తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటోళ్ల కిష్టయ్యకు బాలమణితో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా మద్యానికి బానిసై భార్య బాలమణిని శారీరక, మానసిక వేధిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భర్త కిష్టయ్యపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన కారు

- దంపతులకు తీవ్ర గాయాలు





కొండపాక, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో దంపతులకు తీవ్రగాయలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే.. సిద్దిపేట పట్టణానికి చెందిన కనకాచారి, రత్నమాల దంపతులు ద్విచక్రవాహనంపై చేర్యాలకు బంధువుల వివాహానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు వస్తున్న కారు ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో దంపతులిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది మహేందర్, శ్రీనివాస్ అక్కడికి చేరుకొని వారిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కనకాచారికి కాలు చేయి, ఆయన భార్యకు కాలు విరిగినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో ఎడ్లు మృతి

జహీరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రంజోల్‌లో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో రెండు ఎడ్లు మృతి చెందాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని తయ్యాబ్ ఫంక్షన్‌హాల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్తింగ్ వైరుకు 11కేవీ విద్యుత్ వైరు ఆనుకుని ఉన్నది. శుక్రవారం అటుగా వస్తున్న ఎడ్లు ఆ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలన్నారు. మృతిచెందిన ఎడ్ల విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.



ధాన్యం తరలింపునకు లారీల కొరత

- ఐఎంఎల్ డిపో ఎదుట రైతుల పడిగాపులు

కొల్చారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసి బస్తాల్లో నింపినా లారీ కొరతతో మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. దీంతో అకాల వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసి అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్చారం మండలంలో చిన్న ఘనపూర్, పైతర, మాందాపూర్, రాంపూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. కొంతమంది రైతుల ధాన్యం మూడు రోజుల క్రితం తూకం వేసినా లారీలు అందుబాటులో లేక తరలించకపోవడంతో నీటిపాలైంది. దీంతో శుక్రవారం చిన్నఘనపూర్ గ్రామానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున ఐఎంఎల్ డిపో ఎదుట లారీల కోసం పడిగాపులు కాశారు. అలాగే పైతర, మాందాపూర్ గ్రామాలకు చెందిన రైతుల ధాన్యం తడిసిపోవడంతో మళ్లీ ఆరబెట్టారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా సరైన సమాధానం ఇవ్వడంలేదని పైతర మాజీ సర్పంచ్ ఎల్లేశం తెలిపారు. కొంతమంది రైతుల ధాన్యం మొలకలు కూడా వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లారీల కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



లారీల కోసం ఐఎంఎల్ డిపో ఎదుట ఎదురుచూస్తున్న రైతులు



శివ్వంపేట కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యం

శివ్వంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో ధాన్యం తూకం వేయకపోవడం, లారీల కొరతతో ధాన్యం బస్తాలను లిఫ్ట్ చేయకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం బస్తాలు తడిసి మొలకెత్తడంతో రైతులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మండల పరిధిలోని శివ్వంపేట, చిన్నగొట్టిముక్కల, పెద్దగొట్టిముక్కల, గోమారం, సికింద్లాపూర్ గ్రామాల్లో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం బస్తాలు మొలకెత్తడంతో తడిసిన ధాన్యం బస్తాలను మరల ఆరబెట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. అధికారులు స్పందించి తమ గోడును అర్థం చేసుకొని ప్రకృతి వైపరీత్యా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

కర్కపట్లలో కార్డన్ సెర్చ్



మాట్లాడుతున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

మర్కుక్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్కపట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి, అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాలు నడపవద్దని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేధింపులపై మహిళలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. యువత చదువుపై శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగ నోటిఫికేషన్‌లను వేస్తున్నదని చెప్పారు. బెల్టుషాప్ నిర్వహిస్తున్న ఇంటిపై రైడ్ చేసి 10.70 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్, గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, ప్రొబిషనరీ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో విద్యాబోధన చేయాలి

- గవర్నమెంట్ ఎగ్జామినేషన్ డైరెక్టర్, సిద్దిపేట జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణారావు

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరంలో నూతనోత్సహంతో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని గవర్నమెంట్ ఎగ్జామినేషన్ డైరెక్టర్, సిద్దిపేట జిల్లా ప్రత్యేకాధికారి కృష్ణారావు ఉపాధ్యాయులకు సూచించారు. సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులతో పాటు అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ క్లాసులను, విద్యార్థుల ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని, కేజీబీవీ సమ్మర్ క్యాంప్ తరగతులు, ప్రతి శుక్రవారం జరిగే మెగా తల్లిండ్రుల ఉపాధ్యాయుల సమావేశాన్ని ఆయన సందర్శించారు. జిల్లాలో జరుగుతున్న విద్యాపరమైన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్ తదితరులు ఉన్నారు.



ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని సందర్శించిన కృష్ణారావు

ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి స్వాతి



మాట్లాడుతున్న గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి స్వాతి

మర్కుక్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మూల స్వాతి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి రమాదేవి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వృద్ధుల వరకు ప్రతీ ఒక్కరికి చట్టాలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. న్యాయవాదులు అందుబాటులో ఉన్న చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదవుతుందని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మద్యం తాగి వాహనాలను నడపొద్దని సూచించారు. 20-25 ఏళ్ల మధ్య గల యువకులు ఎక్కువగా డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు పట్టుబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్ రాజు, సభ్యులు పండరీ, ఎన్.సుదర్శన్, రామకృష్ణ, శ్రీనివాస్, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మర్కుక్ పోలీస్ సిబ్బంది కృష్ణ, శేఖర్, శ్రీకాంత్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ జ్యోతి, హోంగార్డు రాములు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల గిరిజన గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థినులతో రీజియన్ కోఆర్డినేటర్

చేగుంట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మెదక్ రీజియన్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ఉన్న ఆరు గిరిజన బాలికల గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కౌన్సెలింగ్‌ను శుక్రవారం ప్రారంభించారు. చేగుంట గురుకుల కళాశాలలో రీజియన్ కోఆర్డినేటర్ గంగారం నాయక్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని చేగుంట, మెదక్, నర్సాపూర్ (నారాయణపూర్) కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, హనుమాజీపేట్, నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి కళాశాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నర్సాపూర్ (నారాయణపూర్) కళాశాలలో హెచ్ఈసీ, సీఈసీ, కళాశాలలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు, కామారెడ్డి జిల్లాలోని హనుమాజీపేట్ కళాశాలలో ఎంపీసీ 35 సీట్లు, బైపీసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 26 వరకు గడువు ఉన్నందున బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కౌన్సెలింగ్‌లో రీజినల్ కోఆర్డినేటర్ గంగారం నాయక్‌తో పాటు, ప్రిన్సిపాల్‌లు సునీత, లలితాదేవి, వాణి, పద్మజ, శ్యామలాదేవి, సావిత్రి పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షను తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది స్వీకరిస్తారు. వారివారి నిత్యమైన పనులను చేస్తూనే నిష్టతో, ఆంజనేయ నామస్మరణతో దీక్షను పాటించే స్వాములు భిక్షను (అన్నప్రసాదం) ఆయా సమయాను సారం తీసుకుంటారు. అలాంటి భిక్షను అందించటం పుణ్యకార్యంగా భావిస్తుంటారు. మాలధారులకు మహాప్రసాదం అందించే మహాభాగ్యంలో సిద్దిపేటలోని పలు సేవా సంస్థలు పాలు పంచుకుంటున్నాయి.



రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ భవనంలో భిక్షను స్వీకరిస్తున్న భక్తులు

మాలధారులకు మహాప్రసాదం

భిక్ష ఏర్పాటు చేస్తున్న ధార్మిక సంస్థలు

వేల సంఖ్యలో స్వీకరిస్తున్న దీక్షదారులు

సిద్దిపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత హనుమ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ నేతృత్వంలో 1983వ సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో ఎనిమిది మంది భక్తులతో మాలధారణ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎల్లలు దాటి లక్షల్లో హనుమాన్ దీక్ష స్వీకరిస్తున్నారు. 108 రోజులు, 41 రోజులు (మండల దీక్ష), 21 రోజులు (అర్ధమండల దీక్ష), 11 రోజులు (ఏకాదశ దివస) దీక్షలను పాటిస్తున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ భక్తులలో పేద, మధ్యతరగతి వారు కూడా మాలధారణ చేసి కష్టాలు తీరాలని వేడుకుంటారు. ప్రతీరోజు వివిధ రకాల వంటలతో, నిష్ఠగా వంట చేయడం కొంత ఆర్థికంగా, మరోరకంగా కూడా ఇబ్బంది అవుతుంది. ఈ ఇబ్బందిని గ్రహించిన సిద్దిపేటలోని ధార్మిక సంస్థలు స్వాములకు నిత్యం భిక్షను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సౌకర్యం అందుబాటులో ఉండడంతోనూ సిద్దిపేట పట్టణం, పరిసర ప్రాంతాల్లో హనుమాన్ దీక్షదారులు ఏటేటా పెరుగుతూనే ఉన్నారు.

శ్రీరామరాజు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

స్వాములకు భిక్షకు అవుతున్న ఇబ్బందిని గ్రహించిన సిద్దిపేట పారుపల్లి వీధిలోని రావిచెట్టు హనుమాన్ ఆలయం సభ్యులు 2006లో మహాప్రసాద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సేవా శాశ్వతంగా ఉండాలనే సదుద్దేశంతో 2010లో శ్రీరామరాజు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. 2011లో ట్రస్ట్ కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు నిత్యం హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శ్రీరామనవమి మొదలుకొని హనుమాన్ జయంతి వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు భిక్షను అందిస్తారు. 21 రోజులు, 11 రోజుల దీక్ష ప్రారంభమయ్యాక 4 గంటల వరకు కూడా భిక్ష కార్యక్రమం కొనసాగిస్తారు. సుమారుగా 8 వందల నుంచి 9 వందల స్వాములు భిక్షను స్వీకరిస్తారు. అంజన్న సేవలో తరించడానికి చాలా మంది భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భిక్ష సేవలో పాల్గొంటారు. భవనం నాలుగో అంతస్తులో వంటగదిని ఏర్పాటు చేసి వంటలు తయారుచేస్తుంటారు. రుచికరమైన, శుచికరమైన వివిధ రకాల వంటలను స్వాములకు ఏర్పాటు వడ్డిస్తున్నారు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో..

సిద్దిపేట గణేష్‌నగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలోనూ భక్తులకు భిక్ష ఏర్పాటు ఉంటుంది. ఇక్కడ అక్షయ తృతీయ నుంచి మొదలుకొని హనుమాన్ జయంతి వరకు 23 రోజులపాటు అందజేస్తారు. 2008లో షామియానాలు వేసి భక్తులకు 11 రోజుల భిక్షను ఏర్పాటు చేశారు. అనంతరం 30 మందితో ట్రస్ట్‌గా ఏర్పడి 2016లో చిన్నజీయర్ స్వామిజీ చేతులమీదుగా నూతన భవనం నిర్మించారు. 120 మంది ట్రస్ట్ సభ్యుల సహకారం, దాతల ప్రోత్సాహంతో భిక్షను అందిస్తున్నారు. ఈ రెండు ఆలయాలే కాకుండా పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో దాతల సహకారంతో భిక్ష కార్యక్రమం కొనసాగుతున్నది.



ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ట్రస్ట్ భవనంలో స్వాములకు భిక్ష



రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ భవనం

ఫారెస్ట్ అధికారులకు జింకను అప్పగించిన యువకులు

బెజ్జంకి, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండారంలో అస్వస్థతకు గురైన ఓ జింకను గమినించిన యువకులు ఫారెస్టు అధికారులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. వేసవి కావడంతో దప్పిక తీర్చుకోవడానికి శుక్రవారం గుండారం శివారులోని ఓ మామిడి తోటలోకి వచ్చిన జింక అస్వస్థతకు గురై కనిపించింది. గమనించిన గ్రామానికి చెందిన కొందరు యువకులు ఫారెస్టు అధికారులకు సమాచారమిచ్చి జింకను అప్పగించారు. జింకను అప్పగించిన శ్రీధర్‌రెడ్డి, రాము, నరేష్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిలను గ్రామస్థులు అభినందించారు.



జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న గుండారం గ్రామ యువకులు

ధాన్యం తూకంలో మోసం.. కేసు నమోదు

జిన్నారం, మే 16 (ఆంధ్రజ్యోతి): జిన్నారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకంలో జరుగుతున్న మోసాలపై రైతుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు చేశారు. రెండు ఎలక్ట్రానిక్స్ తూకం మిషన్లను పరిశీలించగా.. 20 కేజీలకు గానూ 700 నుంచి 800 గ్రాముల చొప్పున తూకం తక్కువగా నమోదవుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై కేసునమోదు చేసి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌డీఏ అధికారులు కూడా కేంద్రాన్ని సందర్శించి, నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి నోటీసులు జారీ చేశారు.



కొనుగోలు కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రమణీయం.. రంగనాథస్వామి కల్యాణం



అందోలులో రంగనాథస్వామి కల్యాణంలో మంత్రి దామోదర్, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

జోగిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : అందోలు పట్టణంలోని ప్రాచీన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చివరి ఘట్టమైన రంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అనువంశిక పూజారి శ్యాంనాథ శర్మ ఆధ్వర్యంలో, అర్చకులు వైష్ణవాగమ పద్ధతిలో క్రతువును నిర్వహించారు. అమ్మవార్ల తరపున మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, శేరి సునీత(మాజీ జడ్పీటీసీ) క్రతవులో పాల్గొన్నారు. ఈ కల్యాణోత్సవంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో మంత్రి కల్యాణ ఘట్టంలో పాలుపంచుకున్నారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్టును దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంత్రికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.

వైభవంగా పెద్దిరాజు, పెద్దమ్మ కల్యాణం

చిన్నశంకరంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూరారం గ్రామ పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. చివరి రోజైన శుక్రవారం పెద్దమ్మ, పెద్దిరాజులకు పట్నాలు, కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వాహకులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా బోనాలను ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఒగ్గు కళాకారులతో ఒగ్గు కథా కాలక్షేపాన నిర్వహించారు.

వీరభద్రుడికి ఘనంగా ఎడ్లబండ్ల ఊరేగింపు

టేక్మాల్, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడ్మాట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రామస్థులు ఎడ్లబండ్ల ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించారు. బండ్లను రంగురంగుల చమ్‌కీలు, కాగితాలు, వస్త్రాలతో అందంగా అలంకరించారు. డప్పుచప్పుళ్ల మధ్య, యువకులు ఉత్సాహంగా చిందులు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉత్సవంలో భాగంగా శనివారం కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ తెలిపారు.



242 రకాల మామిడి పండ్ల ప్రదర్శన



సంగారెడ్డి ఎఫ్ఆర్ఎస్‌లో ప్రదర్శించిన మామిడి రకాలను చూస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

సంగారెడ్డి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ఆచార్య జయశంకర్ ఫల పరిశోధన కేంద్రం(ఎఫ్ఆర్ఎస్)లో శుక్రవారం మామిడి పండ్ల ప్రదర్శనను ప్రారంభించారు. ఇందులో 242 రకాల పండ్లను ప్రదర్శించారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, భారత ఉద్యాన పరిశోధన విశ్వవిద్యాలయం(ఐఐహెచ్ఆర్, బెంగుళూరు)- ఫల ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్‌పాటిల్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు.

ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయాలి

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్‌లోని మామిడిపండ్ల ఎగుమతి ప్రపంచ వ్యాప్తంగా జరగాలని ఆకాంక్షించారు. మామిడి సాగును ఎక్కువగా మన వద్దే చేస్తారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ రకాల మామిడిని ఎలా పండించాలో అవగాహన కల్పించేందుకు పండ్ల ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం ఫల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (ఐఐహెచ్ఆర్-బెంగుళూరు) డాక్టర్ ప్రకాష్ పాటిల్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. మామిడి సాగులో సాంకేతిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. మామిడిలో వందల రకాలున్నాయని వాటిపై అవగాహన పెంచుకుని సాగు చేస్తే నష్టం వాటిల్లదని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు దళారుల ఆగడాలను అరికట్టాలని కోరారు. తక్కువ ధరలకు తీసుకుంటున్నారని, పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని వాపోయారు. మామిడిపండ్లను అస్తబల్‌లో కూడా విక్రయించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకుడు డా.లక్ష్మీనారాయణ, విస్తరణ సంచాలకుడు డా.సురేష్‌కుమార్, డీఆర్వో పద్మజా రాణి, ఉద్యానవన అధికారి సోమేశ్వర్‌రావు, ఎఫ్ఆర్ఎస్ శాస్త్రవేత్త డా.సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

● రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ

మెదక్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ సూచించారు. పది, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మెదక్ మిల్లి అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ పట్టణంలోని స్థానిక క్రిస్టల్ గార్డెన్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమానికి తారిఖ్ అన్సారీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, కళాశాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లానాయక్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీఆర్ఎస్ కన్వీనర్ అంజనేయులు, మిల్లి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ ఒమర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హైబ్రిడ్ మోడల్ రోడ్లకు సర్వే

● హామ్ పథకం ద్వారా మొదటగా గజ్వేల్ నియోజకవర్గంలోని మూడు రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు

తూప్రాన్, మే 16(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో హామ్ (హైబ్రిడ్ అన్యూటీ మోడల్) పథకం ద్వారా రోడ్ల విస్తరణకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే మూడు రోడ్లకు ప్రతిపాదనలు చేయగా, శుక్రవారం ఏఈ మధుసూదన్ సర్వే నిర్వహించారు. హైబ్రిడ్ మోడల్ ద్వారా మొదటగా గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ పరిధిలో మూడు రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. తూప్రాన్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని పాత హైవేరోడ్డు నుంచి గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్ అంబేడ్కర్ విగ్రహం వరకు 12 కిలోమీటర్ల పొడవు అభివృద్ధి చేయనున్నారు. అల్లాపూర్ చౌరస్తా నుంచి కిష్టాపూర్ మీదుగా వెంకటాయపల్లి చౌరస్తా వరకు 8 కిలోమీటర్లు రెండో రోడ్డు, తూప్రాన్ పట్టణంలోని సొసైటీ సమీపంలోని ఎస్సీ కాలనీ మీదుగా ఆబోతుపల్లి, రత్నాపూర్, ఇస్లాంపూర్ వరకు 2.61 కిలోమీటర్ల పొడవు మూడో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీరాజ్ ఏఈ మధుసూదన్ ఆధ్వర్యంలో లాస సంస్థ సర్వే పనులను చేపట్టింది. ఆబోతుపల్లి - గౌడిగూడెం మధ్య హల్దీవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని రైతులు, గ్రామస్థులు కోరారు. గతంలో కాజ్‌వే నిర్మాణం చేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కాజ్‌వే మీదుగా నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సర్వే పనులు నిర్వహిస్తున్న సమయంలో గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అక్కడకు చేరుకొని బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. భారీ వర్షాలు కురిసిన సమయంలోనూ రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణం చేయాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఏఈ మధుసూదన్ వివరించారు. సర్వే సంస్థ లాస ఇంజనీర్లు పులి అగస్టిన్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



తూప్రాన్ శివారులో సిబ్బందితో సర్వే నిర్వహిస్తున్న ఏఈ మధుసూదన్

గణితంలో గీతం విద్యార్థిని లావణ్యకు డాక్టరేట్

పటాన్‌చెరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని డాక్టరేట్‌కు అర్హత సాధించారు. విద్యార్థిని కె.లావణ్య సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



ఎన్యూమరేటర్లకు డబ్బులు ఇవ్వరా..?

- ఆరు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- పలుశాఖల్లో అధికారుల నిలదీత

రామచంద్రాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆరునెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం 'సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే' (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను చేపట్టింది. ఇందుకు ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు ప్రవేటు వ్యక్తులను సర్వేలో వాడుకుంది. నిరుద్యోగులను, విద్యావంతులు సర్వే నిర్వహణకు ఆసక్తి చూపడంతో వారిని ఎన్యూమేటర్లుగా నియమించారు. నవంబరు 2024 నాటికి సర్వేను పూర్తిచేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 18 మంది సూపర్‌వైజర్లు, 180 మంది ఎన్యూమరేటర్లుగా పనిచేశారు. సర్వేకు ఎన్యూమరేటర్ బ్లాక్ (ఈబీ)గా గుర్తించారు. ఒక ఎన్యూమరేటర్‌కు ఒక ఈబీని అప్పగించారు. ఎన్యూమరేటర్లు తమకు అప్పగించిన బ్లాకుల్లో సర్వే పూర్తిచేశారు. సర్వే పూర్తయి ఆరునెలలు పూర్తయినా నేటికీ ప్రభుత్వం డబ్బులు విడుదల చేయలేదు. దీంతో ఎన్యూమరేటర్లు అప్పటి నుంచి డబ్బుల కోసం సూపర్‌వైజర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్యూమరేటర్లకు రావాల్సింది.. రూ.10 వేల లోపు ఉంటుందని ఓ అధికారి తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఈ చిన్న మొత్తాన్ని విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.



తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం

పట్టణాలుగా పారిశ్రామిక గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఐడీఏబొల్లారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక గ్రామాలుగా ఉన్నవాటిని పురపాలక పట్టణాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో సీసీరోడ్లు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. పరిశ్రమలతో కూడిన పట్టణంగా ఉన్నందున కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మురుగు సమస్యలు శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు రక్షిత తాగునీటిని ఇంటింటికి అందించేటట్టు నల్లాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి, మాజీ పురపాలక సంఘం సభ్యులు చంద్రారెడ్డి, హనుమంతురెడ్డి, అనిల్‌రెడ్డి, గోపాలమ్మ, కొండారెడ్డి, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బిక్షపతి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


సంగారెడ్డిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/మునిపల్లి/కల్హేర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : డెంగీ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జడ్పీ కార్యాలయం నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డా.ప్రవీణ్‌కుమార్, నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సంధ్యారాణి, పీవోడీటీ డా.శశాంక్, డెమో ప్రసాద్, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ సాధ్యమని నిజాంపేట, తుర్కపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ తరుణి, డాక్టర్ హరిణి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఖేడ్‌లో సిబ్బందితో కలిసి కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకట శివయ్య, శానిటేషన్ అధికారి శ్రీనివాస్, వైద్య, మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ నివారణపై డాక్టర్ సంధ్యారాణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు. కల్హేర్ మండల పరిధిలోని నాగ్‌ధర్ గ్రామాల్లో నిజాంపేట మండల ప్రత్యేకాధికారి అనిల్, ఎంపీడీవో సంగ్రామ్ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి : ఎంఈవో

కంగ్టి/శివ్వంపేట/నారాయణఖేడ్/జిన్నారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో రహీమొద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కంగ్టిలో పలు కాలనీల్లో పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం యశ్వంత్, కిఫాయత్ అలీ, విజయ్, నాగప్ప పాల్గొన్నారు. శివ్వంపేట మండలం పిల్లుట్లలో ఎంఈవో బుచ్చానాయక్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సంజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, శివాజీ, శైలజ, దేవిసింగ్, శివరాం, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే ఖేడ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని మోర్గి స్కూల్ అధ్యాపకులు శుక్రవారం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వీజీ హెచ్ఎం మన్మథకిషోర్, మోడల్ స్కూల్ అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. జిన్నారం మండలం అల్లీనగర్‌లో గడ్డపోతారం పరిధి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రయాణికులే ఆర్టీసీకి ఆదాయ వనరులు : డీఎం

నారాయణఖేడ్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులే ఆర్టీసీకి ఆదాయ వనరులని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. ఖేడ్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం మర్యాద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ నర్సింలుతో కలిసి బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలకు గులాబీ పువ్వులతో స్వాగతం పలికి, బహుమతులుగా కిచెన్లు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, రాములు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు విఫలం

సంగారెడ్డి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారని ఆదిత్యనగర్ కాలనీ అధ్యక్షుడు సాయిలు విమర్శించారు. సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సంగారెడ్డిలోని 33వ వార్డు ఆదిత్యనగర్ కాలనీ, వసంతనగర్, బర్మాకాలనీ, ఓడీఎఫ్, రెవెన్యూ కాలనీ, శ్రీనివాస్‌నగర్‌తోపాటు అనేక కాలనీల్లో మిషన్ భగీరథ నీరు రాక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

హామీలు అమలు చేసేందుకు చర్యలు


జూక్కల్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జూక్కల్‌తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు. జూక్కల్‌ను పైలట్ ప్రాజెక్ట్‌లో ఎంపిక చేసి, అర్హులందరికీ గృహాలను మంజూరు చేసింది. దీంతో జూక్కల్‌తండాలోని చోటురాంనాయక్, రాములునాయక్, గణపతి, మున్యనాయక్‌ల్లో నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఉండొద్దు


శివంపేట గ్రామ శివారులో వీరభద్ర రైస్‌మిల్ యజమానులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

పుల్కల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి పీఏసీఎస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చౌటకూర్ మండలం శివ్వంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రైతులకు అసౌకర్యం లేకుండా కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

నాసిరకంగా సింగూరు కాలువ పనులు

- ఎడమ కాలువ మరమ్మతులో అవినీతి
- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపణ


పనులను పరిశీలిస్తున్న క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు

పుల్కల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిది నెలలుగా సింగూరు ఎడమ కాలువ పనులు చేపట్టామంటూ మూడు పంటలకు నీళ్ల ఎగ్గొట్టిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.. కాలువ పనుల్లో అవినీతికి పాల్పడ్డారని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. శుక్రవారం సింగూరు ప్రాజెక్టు ఎడమ కాలువ మరమ్మతు పనులను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. జంగిల్ కటింగ్ చేసి అక్కడక్కడ మట్టి దిబ్బలను లెవల్ చేసిన కాంట్రాక్టర్ లైనింగ్‌ను గట్టిపరిచే బెడ్‌ను నాసిరకంగా వేశారని ఆరోపించారు. ఇప్పటికే వందశాతం పనులు పూర్తి చేయకుండానే బిల్లులు పొందారన్నారు. 9 నెలలుగా జరుగుతున్న పనులపై విచారణ చేపట్టి, ఎంతమేర పనులు జరిగాయో, ఎంత నిధులు మంజూరయ్యాయో పూర్తి వివరాలు చెప్పాలని క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్, పుల్కల్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, మాజీ సర్పంచ్ సిద్ధయ్య, నాయకులు ఉన్నారు.

నైపుణ్యాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు వేసవి శిబిరం: ఎంఈవో



శిక్షణ పొందిన విద్యార్థులతో ఎంఈవో తదితరులు

నర్సాపూర్/రామాయంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న ఇతర నైపుణ్యాలను వెలికితీసి వారికి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేందుకు వేసవిలో ప్రత్యేక శిబిరాన్ని విద్యాశాఖ ఏర్పాటు చేసిందని ఎంఈవో తారాసింగ్ తెలిపారు. నర్సాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పీఈటీలు మోహన్, వెంకటలక్ష్మి, శ్రవికను ఎంఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విఠల్, కోఆర్డినేటర్ సుధాకర్‌గౌడ్, సీఆర్‌పీ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. 15 రోజులుగా నడుస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ముగిశాయి. రామాయంపేటలోని బాలికల హైస్కూల్‌లో పిల్లలకు యోగాసనాలు, డ్రాయింగ్, వివిధ గేమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. ముగింపునకు ఎంఈవో శ్రీనివాస్ హాజరై బహుమతులు అందజేశారు.

టీచర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ రమణకుమార్

సంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, టీఆర్ఈఐఎస్ సెక్రటరీ, తెలంగాణ పాఠ్యపుస్తకాల ఇన్‌చార్జి డైరెక్టర్ సీహెచ్.రమణకుమార్ సూచించారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌తో పాటు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణా కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. బోధనలో మెళకువలు నేర్చుకుని విద్యార్థులకు సులభమైన రీతిలో బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, ఏఎంవో బాలయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై శిక్షణను టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సర్వీసెస్ మదన్‌మోహన్ సూచించారు. మెదక్‌లోని కేజీబీవీలో జరుగుతున్న శిక్షణను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లాలో జరుగుతున్న వేసవి క్యాంపు, ఉల్లాస్, బడిబాట, ఉచిత యూనిఫాం, పుస్తకాల పంపిణీ, తల్లిదండ్రులతో సమావేశాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

శివ్వంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గూడూరు గురుపీఠంలో నిర్మించిన సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠాపనలు జూన్ 3 నుంచి 5 వరకు నిర్వహిస్తున్నామని, ఈ ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి గురుపీఠం ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్, ట్రస్టు సభ్యులు రమణగౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆహ్వాన పత్రిక అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మనోహరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్ మండల కేంద్రంలోని 31 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ప్యాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలన

రామాయంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన దామర చెరువులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ పీడీ మాణిక్యం శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులు నాణ్యమైన మెటీరియల్ వాడటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలోనే దామర చెరువు ఇళ్ల నిర్మాణంలో ముందు వరుసలో నిలవటం గొప్ప విషయమన్నారు. ఇక్కడ 100 గృహాలు మంజూరు చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

ఐడీఏబొల్లారం, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఐడీఏబొల్లారం పురపాలక పరిధి అవుటర్ పరిసరాల్లో శుభ్రం చేయాలంటూ సిబ్బందిని ఆదేశించారు. ఉదయం సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుశాతం పరిశీలించారు.

నీటి కుంట నిర్మాణంతో మేలు

కంగ్టి, మే 16 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పొలాల్లో అనుకూలమైన చోట కుంటలు నిర్మించుకుంటే ఎంతో ప్రయోజనంగా ఉంటుందని ఏఈవో సంతోష్ సూచించారు. మండల పరిధిలోని బీంరాలో పలువురు రైతులకు కుంటలు, కందకాల నిర్మాణంపై అవగాహన కల్పించారు.

మెట్రో కెమికల్స్ పరిశ్రమపై చర్యలు తీసుకోండి

గుమ్మడిదల, మే 16 (ఆంధ్రజ్యోతి): వర్షం చాటున పరిశ్రమల లోపల నిలిచిన వ్యర్థ జలాలను ఒక్కసారిగా బయటకు వదలడంతో పంటలు పూర్తిగా నాశనం అవుతున్నాయని, తక్షణమే అలాంటి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గిద్దె రాజు డిమాండ్ చేశారు. రెండురోజుల క్రితం కురిసిన వర్షం మూలంగా పరిశ్రమ లోపల వర్షపునీరు పూర్తిస్థాయిలో నిలిచిపోయిందన్నారు. దీంతో బొంతపల్లిలోని మెట్రో కెమికల్స్ పరిశ్రమ వర్షం నీటిలో వ్యర్థ జలాలను వదలడంతో పంటలు నాశనమవుతున్నాయన్నారు. వెంటనే పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పరమేశ్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్రైం కార్నర్

ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య

- రామాయంపేటలో ఘటన


గంగారం(ఫైల్)

రామాయంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట పట్టణానికి చెందిన ప్రముఖ ఫైనాన్స్ వ్యాపారి గడ్డం గంగారం(55) శుక్రవారం రాత్రి బైపాస్ రోడ్డులోని ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయిదే అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారమందించాడు. ఎస్ఐ బాలరాజ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉంటే గంగారం ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అందరితో కలుపుగోలుపుగా ఉండే ఆయన మృత్తి పట్ల పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేశారు

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారం, నగదు అపహరణ

శివ్వంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు అపహరించుకుపోయిన సంఘటన శివ్వంపేట మండలం మల్లుపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లికి చెందిన వనం హరీశ్ పదేళ్ల క్రితం కుటుంబంతో వచ్చి మల్లుపల్లి తండా శివారులోని పౌల్ట్రీఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. 14న కుటుంబసభ్యులతో అత్తగారింటికి వెళ్లాడు. శుక్రవారం వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి బీరువాను పరిశీలించగా.. రూ.30 వేల నగదు, బంగారు ఆభరణాలు, ఎస్సెస్సీ మెమో, ఎల్ఐసీ బాండ్, ఇతర కొన్ని డాక్యుమెంట్లను దుండగులు అపహరించుకుపోయారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాదరక వాతావరణానికి కృషి


మయూరినగర్ పార్కులో లైట్ల ఏర్పాటు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : రాత్రి సమయాల్లో సైతం పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధి మయూరినగర్ కాలనీ పార్కులో రూ.50 లక్షలు అంచనా వ్యయంతో లైటింగ్ పనులను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కాలనీల్లోని ఖాళీస్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 2009 తరువాత పార్కుల్లో ఎటువంటి సదుపాయాలు కల్పించలేదని వివరించారు. బస్తీదర్శన్‌లో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ సురేష్, డీఈ సురేందర్, ఏఈ దివ్యతేజ, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను గుర్తించేందుకు సర్వే


శివ్వంపేటలో 'ఉల్లాస్'పై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో బుచ్చానాయక్

నర్సాపూర్/మనోహరాబాద్/శివ్వంపేట/చిన్నశంకరంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులుగా ఉన్నవారిని గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో త్వరలో ఉల్లాస్ ప్రాథమిక సర్వే నిర్వహించనున్నట్లు మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ మధ్యలో ఆపేసిన వారికి ఓపెన్ ఇంటర్ కూడా చదివించి వారిని ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గౌరీశంకర్, ఎంఈవో తారాసింగ్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ పథకంతో నిరక్షరాస్యులకు మేలు జరుగుతుందని ఎంపీడీవో కృష్ణమూర్తి అన్నారు. మనోహరాబాద్ మండల సమైక్య కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఉల్లాస్ పథకం పై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పెంటాగౌడ్, ఎంఈవో, సీఆర్పీలు, సీసీలు, శోభారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు. శివ్వంపేట ఎంఈవో కార్యాలయంలో మండల వీవోఏ, సీసీ, సీఆర్పీలకు ఎంఈవో బుచ్చానాయక్ ఆధ్వర్యంలో ఉల్లాస్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రం పాల్గొన్నారు. రక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం మన అందరి బాధ్యత అని ఎంపీడీవో దామోదర్ అన్నారు. ఉల్లాస్ నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో పలు శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పుష్పవేణి, ఏపీఎం లక్ష్మీనారాయణ, ఎంపీవో గిరిజారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన


కంటి శస్త్రచికిత్సల కోసం బస్సులో బయలుదేరిన బాధితులు

నారాయణఖేడ్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్‌లోని సత్యసాయి ఆలయ ఆవరణలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరానికి 100 మంది హాజరుకాగా.. శంకర ఆసుపత్రి కంటి వైద్యులు పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా 26 మందికి కాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి, ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించేందుకు నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమాలను సత్యసాయి సేవాసమితి జిల్లా కన్వీనర్ శంకరప్ప పర్యవేక్షించారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి


హరికిషన్‌గౌడ్ (ఫైల్)

కంది, మే 16 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కల్పకుంటకు చెందిన హరికిషన్ 11 నెలలుగా కంది మండలంలోని ఎర్దనూర్ తండాలో పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరికిషన్‌గౌడ్ మృతి తమ తండాకు తీరని లోటని తడావాసులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం కంది ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హరికిషన్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.


ఆలయ అభివృద్ధి పట్టదా..?

- ధర్మకర్తల ఆవేదన

శివ్వంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న పునాతన దొంతి ఆలయ అభివృద్ధిని అధికారులు పట్టించుకోవడం లేదని ఆలయ ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం దొంతిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కుటుంబం 1984లో వేణుగోపాలస్వామి పేర 242 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, ఆ భూముల్లో కొందరు పంట సాగు చేసుకుంటూ ఆలయానికి 1993 నుంచి కౌలు చెల్లించకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఆలయాన్ని తమకు అప్పగిస్తే ఆలయ అభివృద్ధితో పాటు నిర్వహణ సక్రమంగా సాగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పంచ్ పడితే పతకమే..

- పలు మెడల్స్ సాధించిన సాయికుమార్


మెడల్స్‌తో సాయికుమార్

కొండాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పంచ్ పడితే పతకమే అన్న విధంగా దూసుకెళ్తున్నాడు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధి గిర్మాపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల సాయికుమార్. సాయికుమార్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచీ కరాటేపై ఆసక్తి ఉండడంతో తల్లిదండ్రులకు శిక్షణ ఇప్పించారు. గతేడాది విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి కరాటేలో సిల్వర్ మెడల్ గెలుపొందాడు. ఏప్రిల్‌లో మలేషియా దేశంలో జరిగిన నేషనల్ లెవల్ కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. దేశ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలుపొందిన సాయికుమార్‌ను గ్రామస్థులు శుక్రవారం సన్మానించారు.